

సాలూరు శ్యామలాంబ పండుగకు ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 18(ఆంధ్రజ్యోతి): సాలూరులో ఈ నెల 18 నుంచి 21 వరకు జరగనున్న శ్యామలాంబ పండుగ నేపథ్యంలో ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు జిల్లా ప్రజారవాణా అధికారి ఏ.విజయకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రయాణికుల సౌకర్యార్థం పాలకొండ, పలాస, టెక్కలి, శ్రీకాకుళం 1, 2 డిపోల నుంచి 356 బస్సులను నడుపుతున్నాం. జిల్లా నుంచి బయలుదేరే దూరప్రాంత సర్వీసులు మినహా, మిగిలిన అన్ని మార్గాల్లో తిరిగే బస్సులను సాలూరుకి మళ్లిస్తాం. ఈ ప్రత్యేక బస్సుల సౌకర్యాన్ని వినియోగించుకోవాల'ని విజయకుమార్ కోరారు.

కార్యకర్తలే టీడీపీకి అండ

- వారిని విస్మరించేది లేదు
- మంత్రి అచ్చెన్నాయుడు
- కోటబొమ్మాళిలో మినీమహానాడు విజయవంతం

టెక్కలి, మే 18(ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అండ. కార్యకర్తలు ఏ స్థాయిలో ఉన్నా వారిని విస్మరించేది లేదు. అర్ధరాత్రి ఫోన్ చేసినా వారికి అండగా ఉంటాను. కార్మికుల సంక్షేమమే ధ్యేయమ'ని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆదివారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో మినీమహానాడు సభ నిర్వహించారు. పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు హాజరుకాగా.. పార్టీ జెండాను అచ్చెన్న ఎగురవేసి.. ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో అచ్చెన్న మాట్లాడుతూ.. 'టీడీపీ ఆవిర్భవించి 43 ఏళ్లు అయింది. అందులో 23ఏళ్లు అధికారంలో ఉన్నామంటే.. దాని వెనుక కార్యకర్తల కృషి ఎనలేనిది. టీడీపీ బాధ్యతాయుతమైన పార్టీ. కోటి 3లక్షల సభ్యత్వాలతో పటిష్టంగా ఉంది. గ్రామ స్థాయి, మండల స్థాయి కమిటీలతో బలంగా ఉంది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అభివృద్ధితోనే గెలిచి తీరుతాం. గత ప్రభుత్వం చేసిన తప్పులు మనం కూడా చేయకూడదు. సంపద సృష్టించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యం. కార్యకర్తలకు, నాయకులకు మధ్య విభేదాలు లేకుండా కలిసి పనిచేసే దిశగా పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపిద్దాం. అప్పులో ఉన్న రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గాడిలో పెట్టారు. మహానాడు తర్వాత సూపర్‌సిక్స్ హామీలు క్యాలెండర్ రూపేనా విడుదల చేస్తారు. ఈ నెల 27 నుంచి కడపలో జరిగే టీడీపీ మహానాడు విజయవంతం చేయడానికి కార్యకర్తలు తరలిరావాల'ని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

భావనపాడులో హార్బర్..

భావనపాడులో హార్బర్ మంజూరుకు కృషి చేసి మత్స్యకారులను ఆదుకుంటామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. 'టెక్కలి నియోజకవర్గాన్ని 2029 నాటికి అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా. నియోజకవర్గ పరిధిలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా తారురోడ్లు, సీసీ రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. టెక్కలి, నరసన్నపేట ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వ నిధులు ద్వారా ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.1,200కోట్లు మంజూరయ్యాయి. సంతబొమ్మాళి మండలంలో పదివేల ఎకరాల్లో పారిశ్రామిక రంగం విస్తరించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తాం. రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించి ఆదాయ వనరులు పెంచుకోవాలి. రైతులకు సంబంధించి భూ సమస్యలను పరిష్కరిస్తాం. ఉత్తరాంధ్ర సుజలస్రవంతి ద్వారా వంశధారకు నీరందిస్తామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు.

- వైసీపీ అరాచక పాలనలో అక్రమ కేసులతో నాతో సహా కార్యకర్తలందరూ నిద్రలేని రాత్రులు గడిపాం. గత ఐదేళ్లు ఇష్టారాజ్యంగా నోరుపారేసుకొని చెలరేగిన వైసీపీ నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారో కనబడడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దోపిడీ చేసిన ఏ ఒక్కర్నీ విడిచిపెట్టేది లేదు' అని మంత్రి అచ్చెన్న స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ఎల్ నాయుడు, బోయిన గోవిందరాజులు, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండల పార్టీల అధ్యక్షులు బోయిన రమేష్, పినకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, హనుమంతు రామకృష్ణ ఉన్నారు.

అగ్నిమాపక శాఖలో సమస్యలెన్నో

- అరకొరగా సిబ్బంది
- హోంగార్డులతోనే సర్దుబాటు
- శిథిల భవనాల్లోనే కేంద్రాలు
- పాత వాహనాలతో తప్పని ఇబ్బందులు



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

ఇచ్ఛాపురం, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అగ్నిప్రమాదాలు పెరుగుతున్నా యి. ప్రస్తుత వేసవి వేళ రోజూ ఏదోఒక చోట అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉన్నా యి. ఎక్కువగా జీడితోటల్లో చిన్నపాటి నిప్పు పెను ప్రమాదానికి కారణమవుతోంది. కాగా.. అగ్నిప్రమాదాల నివారణ దిశగా అగ్నిమాపక శాఖ సన్నద్ధత లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఆ శాఖకు సిబ్బంది కొరత వెంటాడుతోంది. జిల్లాలో శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, ఆమ దాలవలస, కొత్తూరు, రణస్థలం, మందస, పొందూరులో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నా యి. వైసీపీ హయాంలో పదవీ విరమణ చెందినా.. కొత్తగా నియామకం చేపట్టలేదు. దీంతో అగ్నిమాపక కేంద్రాలను అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. మందస, పొందూరులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నా రు. ఇక్కడ సుశిక్షితులైన సిబ్బంది లేకపోవడంతో పోలీస్ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం అగ్నిమాపక కేంద్రంలో 29 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా.. 21 మంది మాత్రమే ఉన్నారు. ఇక్కడ పోలీస్ శాఖ 8 మంది హోంగార్డులను సర్దుబాటు చేసింది. ఇచ్ఛాపురంలో 16 మందికిగాను 8 మంది మాత్రమే ఉన్నారు. పోలీస్‌శాఖ 8 మంది హోంగార్డులను సర్దుబాటు చేసింది. సోంపేటలో 16 మందికిగా ను 8 మంది మాత్రమే ఉన్నారు. ఇద్దరు హోంగార్డులను సర్దుబాటు చేశారు. టెక్కలిలో 16 మందికి ఆరుగురు ఉన్నారు. నలుగురు హోంగార్డులను పోలీస్ శాఖ సర్దుబాటు చేసింది. కోటబొమ్మాళిలో 16 మందికిగాను ఐదుగురే ఉన్నారు. నలుగురు హోంగార్డులను సర్దుబాటు చేశారు. నరసన్నపేటలో 16 మందికి గాను ఏడుగురు మాత్రమే ఉన్నారు. ముగ్గురు హోంగార్డులను సర్దుబాటు చేశారు. ఆమ దాలవలసలో 16 మందిగాను ఏడు గురు ఉన్నారు. ఐదుగురు హోంగార్డులను సర్దుబాటు చేశారు. కొత్తూరులో 15 మందికి గాను ఐదుగురు ఉన్నారు. ఆరుగురు హోంగార్డులను సర్దుబాటు చేశారు. రణస్థలంలో 16 మందికి గాను ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఆరుగురు హోంగార్డులను సర్దుబాటు చేశారు.

సొంత భవనాల్లేవ్..

జిల్లాలో చాలాచోట్ల అగ్నిమాపక కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. అత్యవసర సేవలు అందించే విభా గాలకు వాహనాలు సమకూర్చాల్సి ఉన్నా, గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. దీంతో ఇప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. పొందూరులో మార్కెట్ యార్డులో కార్యాలయం నిర్వహిస్తున్నారు. రేకుల షెడ్ లో వాహనాన్ని నిలుపుతున్నారు. సోంపేట, కొత్తూరు, ఇచ్ఛాపురంలో అగ్నిమాపక కేంద్రాల భవనాలు శిథిలా వస్థకు చేరుకున్నాయి. కొన్ని స్టేషన్ల వద్ద నీరు నింపేం దుకు బోర్లు లేవు. సమీపంలోని కాలువలు, చెరువుల్లో నీటిని నింపాల్సి వస్తోంది. చాలాకేంద్రాల వద్ద సిబ్బం దికి కనీసం మరుగుదొడ్లు లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దశాబ్దాల నాటి వాహనాలు కావడంతో తరచూ మొరాయిస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు సిబ్బందిని నియా మకం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా..

అగ్నిమాపక శాఖ పనితీరును మరింత మెరుగుపరుస్తున్నాం. సిబ్బంది కొరత వాస్తవమే. ఫైర్‌మెన్లతోపాటు డ్రైవర్ల కొరత ఉంది. అయినా సరే ఎక్కడా ఇబ్బందులు లేకుండా ముందడుగు వేస్తు న్నాం. కొత్త ఫైరింజన్లతోపాటు కొత్త భవనాలకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో నిధుల విడుదలకు అవకాశం ఉంది. వేసవి దృష్ట్యా అప్రమత్తంగానే ఉన్నాం.

-మోహనరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, శ్రీకాకుళం



కింతలి పీహెచ్‌సీ

పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత

- జిల్లాలో 25 పోస్టులు ఖాళీ
- గ్రామీణ వాసులకు సక్రమంగా అందని వైద్యసేవలు

పొందూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ) వైద్యుల కొరత వెంటాడుతోంది. గ్రామీణ ప్రాంతవాసులకు వైద్యసేవలు అందించడంతో పీహెచ్‌సీలు కీలకం. కాగా వైద్యుల కొరత కారణంగా సక్రమంగా సేవలు అందడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 71 పీహెచ్‌సీల్లో 146 మంది వైద్యులు ఉండాలి. కానీ ప్రస్తుతం 121 మంది వైద్యులు మాత్రమే ఉన్నారు. 25మంది వైద్యాధికారపోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీహెచ్‌సీల్లో వైద్యులు ఇన్‌సర్వీసుపై పీజీ మెడికల్ విద్యకు కొంతమంది వెళ్లిపోయారు. మరి కొంతమంది డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే ఇంకొంతమందంఇ 104 వాహ నాలతోపాటు గ్రామాల్లో వైద్యశిబిరాల నిర్వహణకు వెళ్తున్నారు. దీంతో పీహెచ్‌సీల్లో ఎఫ్ఎన్ వోలు, ఏఎన్ఎంలే దిక్కవుతున్నారు. సక్రమంగా సేవలు అందడం లేదని రోగులు ఆరోపిస్తు న్నారు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలని, మెరుగైన సేవలు అందజేయాలని కోరుతున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత వద్ద ప్రస్తా వించగా.. త్వరలోనే పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం చేపడతామని తెలి పారు. మెరుగైన వైద్యసేవలు అందజేస్తామని స్పష్టం చేశారు.

'పది' సప్లిమెంటరీ

- 28వరకూ పరీక్షలు
- 21 కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

నరసన్నపేట, మే 18(ఆంధ్రజ్యోతి): పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 28 వరకూ జరగనున్నాయి. 21 కేంద్రాల్లో 5,059 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామని డీఈవో తిరుమల చైతన్య తెలిపారు. '21 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు 21 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించాం. పర్యవేక్షణ బాధ్యతను ఎంఈవోలకు అప్పగించాం. సప్లిమెంటరీలో పాసైన విద్యార్థులను కూడా రెగ్యులర్‌గానే పరిగణిస్తామ'ని డీఈవో తెలిపారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్

- జిల్లాలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు

ఎచ్చెర్ల/నరసన్నపేట, మే 18(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీఈఏపీ సెట్ సోమవారం నుంచి నిర్వహించనున్నారు. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఈ పరీక్షను ఈ నెల 27 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 19,20 తేదీల్లో బైపీసీ స్ట్రీమ్‌లో ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి సెట్ జరగనుంది. అలాగే 21 నుంచి 27 వరకు (25న మినహా) ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశానికి ఈ పరీక్ష జరుగుతుంది. జేఎన్‌టీయూ(కాకినాడ) పర్యవేక్షణలో టీసీఎస్ టెక్నికల్ సపోర్ట్‌తో ఈ పరీక్ష నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండు షిఫ్ట్‌ల్లో పరీక్ష జరుగుతుంది. జిల్లాలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీ (నరసన్నపేట), ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంటు(టెక్కలి)లో నిర్వహించే ఈ పరీక్షలకు సుమారు 18వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫొటోను అతికించి కళాశాల ప్రిన్సిపాల్ లేదా ఏదైనా అధికారితో సంతకం చేయించుకోవాలి. పరీక్షా కేంద్రానికి ఒరిజనల్ గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. నిర్దేశించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు

ఎచ్చెర్ల/ నరసన్నపేట, మే 18(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన సాంకేతిక విద్యా సంస్థల్లో(ఐఐటీ) ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్షకు 242 మంది విద్యార్థులకుగానూ 239 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం కూడా అదేరీతిన పరీక్ష రాశారు. నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ కేంద్రంలో ఉదయం 320మంది విద్యార్థులకుగాను 317మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 314 మంది పరీక్ష రాశారు.



నరసన్నపేటలో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు



మరిడమ్మకు పూజలు చేస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ఘనంగా మరిడమ్మ సంబరం

5లో



ఈశ్వరరావు (ఫైల్)

పాలవలసలో యువకుడి హత్య

- సంబరాలు వేళ విషాదం

6లో

నేడు, రేపు పిడుగులు!

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, కలెక్టరేట్, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 19, 20వ తేదీల్లో 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో గాలులు, ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. '21, 22, 23 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కూడా కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. పిడుగులు పడే ప్రమాదం ఉంది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. ఎటువంటి ప్రాణనష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపడతాం. వర్షం పడే సమయంలో బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదు, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఉండకూడదు. ఫోన్లు, హెడ్‌ఫోన్లు వాడరాదు. ఇంట్లో ఉన్న పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులను కప్పుతో కూడిన షెడ్‌లో ఉంచాలి. టీవీ, ఫ్రిజ్, ఇతర విద్యుత్తు పరికరాలను ఆఫ్‌చేయాలి. నీటి మోటార్లు నడపరాదు, గాలీవాన సమయంలో పొలాల్లోకి వెళ్లొద్దు. వాహనాలు నడిపేవారు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలక్ట్రానిక్ పరికరాలను వాడరాదు. అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాల'ని కలెక్టర్ వివరించారు.

భక్తజన సందోహం... ఆదిత్యాలయం



భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు

అరసవల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో ఆదిత్యాలయం.. భక్తజన సందోహంతో నిండిపోయింది. వైశాఖమాస ఆదివారం పురస్కరించుకుని.. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. తొలుత తలనీలాలు సమర్పించి.. ఇంద్ర పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. ఆలయ ఆవరణలో క్షీరాన్న పాయసం వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. కేశఖండన శాల, ఇంద్ర పుష్కరిణి, క్యూలైన్లు.. ఎక్కడ చూసినా భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ అనివెట్టి మండపం సూర్యనమస్కారాలు ఆచరించే భక్తులతో నిండిపోయింది. కాగా కేశఖండనశాల ఆవరణలో నీడ సౌకర్యం లేక భక్తులు ఎండలో ఇబ్బందులు పడ్డారు. ప్రసాదాలు, తాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు లేకుండా ఈవో శోభారాణి ఏర్పాట్లను పర్యవేక్షించారు. 'ఆదివారం ఒక్కరోజు స్వామికి రూ.13,03,091 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రికార్డు స్థాయిలో రూ.9,45,900 సమకూరాయి. విరాళాల ద్వారా రూ.78,216, ప్రసాదాలు విక్రయం ద్వారా రూ.2,78,975 లభించింద'ని ఈవో తెలిపారు.



ఇంద్రపుష్కరిణి వద్ద భక్తుల సందడి

22న శ్రీకాకుళంలో మినీ మహానాడు

● ఏర్పాట్లపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ సమీక్ష



మినీ మహానాడు ఏర్పాట్లపై చర్చిస్తున్న కలమట వెంకటరమణ

అరసవల్లి, మే 18(ఆంధ్రజ్యోతి) శ్రీకాకుళంలో ఈనెల 22న నిర్వహించే మినీ మహానాడును జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోగల జిల్లాపార్టీ కార్యాలయంలో మినీమహానాడు ఏర్పాట్ల సన్నాహాలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగేకార్యక్రమానికి కేంద్ర,రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు,అచ్చెన్నాయుడు, జిల్లాలోనిఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, రాష్ట్ర, జిల్లా కార్యవర్గసభ్యులు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.కార్యక్రమంలో మెండ దాసునాయుడు, పీఎంజే బాబు, మాదారపు వెంకటేష్, పాండ్రంకిశంకర్, కొమ్మనాపల్లి వెంకటరామరాజు, తోణంగి వెంకన్నయాదవ్, ఎస్వీ రమణమాదిగ, విభూది సూరిబాబు, కవ్వాడి సుశీల, బోనిగి భాస్కరరావు పాల్గొన్నారు.

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి

● ఆమదాలవలస ఎమ్మెల్యే. పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్

ఆమదాలవలస, మే 18 (ఆంధ్రజ్యోతి):క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలనిఆమదాలవలసఎమ్మెల్యే, పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ తెలిపారు.ఆదివారం మండంలోని తొగరాంలో టీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జిల్లాతెలుగు మహిళా అధ్యక్షురాలు మెట్ట సుజాత, నారాయణపురం ప్రాజెక్టు ఛైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, తమ్మినేని శ్రీరామ్మూర్తి, టీడీపీ నాయకులు సంపతిరావు మురళి, హనుమంతు బాలకృష్ణ పాల్గొన్నారు.

సైనిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



మృతదేహంపై జాతీయజెండాను కప్పుతున్న బీఎస్ఎఫ్ జవాన్లు

ఆమదాలవలస, మే18 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని ఆరో వార్డులో గల టి.మన్నయ్యపేటకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ గొద్దు మోహన్‌రావు (46) అంత్యక్రియలు ఆదివారం సైనిక లాంచనాలతో నిర్వహించారు. ఢిల్లీలోని బీఎస్ఎఫ్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తుండగా శుక్రవారం మోహన్‌రావు గుండెపోటుకు గురై మృతిచెందిన విషయం విదితమే. శనివారం ఉదయం ఢిల్లీలోని ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం బీఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్స్ వద్ద అధికారులు మోహన్‌రావు భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆదివారం వేకువజామున ఐదుగంటలకు ఢిల్లీ నుంచి విమానంలో విశాఖవిమానాశ్రయానికి భౌతికకాయం చేరుకుంది. ఇక్కడ సంబంధిత బీఎస్ఎఫ్ అధికారులు కూడా నివాళులర్పించారు. అనంతరం బీఎస్ఎఫ్ వాహనంలో భౌతికకాయాన్ని స్వగ్రామానికి తరలించారు. శ్రీకాకుళం సమీపంలోని కొత్తరోడ్డు నుంచి మన్నయ్యపేట వరకు యువకులు జాతీయ జెండాలను పట్టుకొనిర్యాలీ నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఇంటికి చేరుకున్న మోహన్‌రావు పార్థివదేహాన్ని చూసి భార్యాపిల్లలు, కుటుంబసభ్యులు విలపించారు. అనంతరం భారీగా ర్యాలీగా గ్రామంలోని శ్మశానవాటికకు తరలించారు. అక్కడ బీఎస్ఎఫ్ జవాన్లు మోహన్‌రావు మృతదేహం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఉంచారు. మూడురౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు.అంత్యక్రియల్లో ఆరు, ఏడోవార్డుల యువకులు, టి.మనయ్యపేట ఫ్రెండ్స్‌యూత్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు భరోసానిద్దాం



శ్రీకాకుళం రిమ్స్: కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం రిమ్స్, మే 18(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులకు భరోసానిద్దామని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణాధికారి డాక్టర్ టి.శ్రీకాంత్ తెలిపారు. ఆదివారంస్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మే నెల మూడోఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం పురస్కరించుకుని ఎయిడ్స్/హెచ్ఐవీ బాధితులకు సంఘీభావంగా కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో బీసీహెచ్ అప్పలనాయుడు, ఏఆర్టీ సిబ్బంది, ఐసీటీసీ, డీఎస్ఈఆర్సీ, పీపీటీసీటీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మోహిని, ఆదిలింగం, మంత్రి వెంకటస్వామి పాల్గొన్నారు.

●ఇచ్ఛాపురం, మే18(ఆంధ్రజ్యోతి):హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను తరిమికొట్టాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పాతిర్ల దేవేంద్ర రెడ్డి కోరారు. ఆదివారం ఇచ్ఛాపురంలోని సీహెచ్‌సీ నుంచి కొవ్వొత్తులతో ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

● జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదనరావు



మాట్లాడుతున్న మధుసూదనరావు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్‌చేసుకోవాలని, వారికి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మధుసూదనరావు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలోని ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో జిల్లా అథ్లెటిక్స్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర అథ్లెటిక్స్ క్యాలెండర్ విడుదల మేరకు 10 నుంచి 12 ఏళ్లలోపు యువ క్రీడాకారులను గుర్తించి, వారికి మరింత పదును పెట్టేవిధంగా జిల్లాస్థాయి పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఉపాధ్యక్షులు నౌపడ విజయకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కె.గోపి, పి.తవిటయ్య, రాష్ట్ర టెక్నికల్ కమిటీ ఛైర్మన్ కె.హరిబాబు, జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.మాధవరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కవిటి, మే18(ఆంధ్రజ్యోతి): బొరివంక జడ్పీ పాఠశాలలో 2005- 06లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో చదివిన వారంతా ఒకచోటకు చేరి పాత జ్ఞాపకాలు, మధుర స్మృతులను నెమరవేసుకున్నారు.ఈసందర్భంగా ఉపాధ్యాయులకు సత్కరించారు. కార్యక్రమంలో శంకరరావు, జయరాం, పుష్పలత పాల్గొన్నారు.



బొరివంక జడ్పీ ఉన్నత పాఠశాల 2005-06 బ్యాచ్ విద్యార్థులు

కరకట్టలు లేక.. కోతకు గురై

● గండిపడితే పొంచి ఉన్న ముప్పు ● ఇదీ వంశధార నది ఒడ్డున వాడవలస పరిస్థితి



గ్రామం సమీపంలో కోతకు గురైన వంశధార నది గట్టు

ఎల్.ఎన్.పేట, మే 18 (ఆంధ్రజ్యోతి)

వాడవలస వద్ద వంశధార నదిపై కరకట్టలు లేకపోవడంతో కోతకు గురవుతుండడంతో గట్టు బలహీనపడుతోంది. దీంతో భారీ వరద వచ్చినా రానున్న రోజుల్లో గండిపడి గ్రామంలోకి చొచ్చుకొచ్చే ప్రమాదముందని స్థానికులు భీతిల్లుతున్నారు. తక్షణమే వంశధార అధికారులు గట్టుపై మర్రి చెట్టు వద్ద కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.



వాడవలస వద్ద గట్టు కోతకు గురికావడంతో బయటకు కనిపిస్తున్న మర్రిచెట్టు వేళ్లు

మండలంలోని వంశధారనది ఒడ్డున ఉన్న వాడవలస వద్ద కోతకు గురైన నదిగట్టుకు గండి పడితే వరదలో కొట్టుకుపోయే ప్రమాదముందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో ఏటా నదికి భారీ వరదలు రావడంతో గ్రామం వద్ద గట్టుపై ఉన్న మర్రిచెట్టు వేళ్లకు ఆనుకుని ఉన్న మట్టి కోతకు గురవడంతో గట్టు బలహీనపడింది. దీంతో మళ్లీ భారీ వరద వస్తే గట్టు కొట్టుకుపోయే ప్రమాదముందని గ్రామస్థులు సీహెచ్ భాస్కరరావు, ఎ.రమణమూర్తి, పి.మల్లేశ్వరరావుతోపాటు మరి కొందరు చెబుతున్నారు. వంశధార నదికి తూర్పువైపున కరకట్టల నిర్మాణం పూర్తిచేశారు. దీంతో వర్షాకాలంలో వచ్చిన వరదనీరు పడమరవైపు ఉన్న నది గట్టు వైపు చొచ్చుకొస్తోంది. దీంతో దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన మట్టి గట్టు కోతకు గురై వర్షాకాలంలో గండ్లు పడే ప్రమాదముందని వాడవలస వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో కోతకు గురవుతున్న ప్రాంతంలో గతంలో వాడవలస వద్ద అధికారులు గండిపడకుండా ఇసుక బస్తాలతో గట్టును తాత్కాలికంగా రక్షించేలా చర్యలు తీసుకున్నారు. దశాబ్దాల కాలం నుంచి ఏటా వర్షాకాలంలో వంశధారనదికి వరదలొచ్చిన సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు గట్టుకు గండిపడకుండా రక్షణ కల్పిస్తామని హామీఇచ్చి తర్వాత మరిచిపోతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఎల్.ఎన్.పేట మండలం పరిధిలో వంశధారనదిలో కరకట్టల నిర్మాణం ప్రారంభించి సుమారు 15 ఏళ్లు గడుస్తోంది. అయితే ఈ పనులు ప్రభుత్వాలు మరుతున్నా పూర్తిస్థాయిలో చేపట్టడంలేదు. తక్షణమే కరకట్టల పనులు పూర్తిచేసి తమకు వంశధార నదికి వచ్చే వరదల నుంచి రక్షించాలని వాడవలస గ్రామస్థులు కోరుతున్నారు.

డీఎస్సీకి 'ఎర్రన్న విద్యా సంకల్పం' తొలిమెట్టు

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న గొండు శంకర్

అరసవల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): ఎర్రన్న విద్యా సంకల్పం రానున్న డీఎస్సీ పరీక్షకు ఇది తొలి మెట్టు అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండుశంకర్ తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలో డీఎస్సీ(ఎస్జీటీ), కానిస్టేబుల్ మెయిన్ అభ్యర్థుల కోసం ఎర్రన్న విద్యాసంకల్పం-2025లో భాగంగా మాక్‌టెస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా పరీక్ష కేంద్రాన్నిసందర్శించారు.అనంతరం మాట్లాడుతూ కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆలోచనల మేరకుమెరుగైన సిక్కోలు కోసమే ఎర్రన్న విద్యా సంకల్పం నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ కోసం నిరీక్షిస్తున్న వారి కోసం విద్యాశాఖ మంత్రితో మాట్లాడి వారి నిరీక్షణకు తెరదించి, యువతకు అండగా నిలిచారన్నారు.కార్యక్రమంలో శ్రీనివాస చక్రవర్తి, కె.శివశంకర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమానుల సేవలు అభినందనీయం

నందమూరి అభిమానులు సేవాతత్పరులని, ఎన్టీఆర్ అభిమానులు చేస్తున్న సేవలు అభినందనీయమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం పురస్కరించుకుని ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు దుంగ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న బాడీబిల్డింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో జిల్లా పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కళ్యాణరామ్ ఫ్యాన్స్ నందమూరి కుటుంబ అభిమానులు 300 మంది పాల్గొన్నారు.

రేపు మిస్టర్ ఆంధ్రా జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మే18(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో మంగళవారం మిస్టర్ ఆంధ్రా జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారుఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలలో నిర్వాహకులు, స్టార్ బాడీబిల్డర్స్ ప్రధాన కార్యదర్శి వి. విజయ్‌కుమార్, దుంగశ్రీధర్, బి.మధు, చిన్నరాజు, పి.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, బి.కామరాజు, వై.ప్రసాద్, యు.గంగరాజు, అంధవరపు శ్రీనివాసరావు, లక్ష్మణ్ రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ సంబరం



ఎచ్చెర్ల: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఎచ్చెర్ల, మే 18(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు క్వార్టర్స్ ఆవరణలో మరిడమ్మ అమ్మవారి సంబరం ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఏటా వైశాఖమాసంలో సంబరాన్ని పోలీసు కుటుంబాలు నిర్వహిస్తుంటాయి. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మరిడమ్మకు వస్త్రాలు సమర్పించి అమ్మ వారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అంతా ఐక్యంగా ఇటువంటి సంబరాలు నిర్వహించడం శుభసూచకమన్నారు. జిల్లా పోలీసు విభాగానికి, సిబ్బందికి అమ్మవారి కరుణకటాక్షాలు ఉండాలని ఆకాం క్షించారు.కార్యక్రమంలో సాయుధసిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎచ్చెర్ల, ఎస్ఎం పురం, జరజాం, లింగాలపేట పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో హనుమాన్ తిరువీధి

ఇచ్ఛాపురం, మే18(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో 41రోజులు దీక్ష పూర్తి చేసుకున్న భక్తులు రథంపై హనుమాన్ విగ్రహంతో తిరువిధి నిర్వహించారు. ఆదివారం రాత్రి తారకేశ్వరాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా సాగిన తిరువీధికి భక్తులు హారతులు తీసుకొని పూజలుచేశారు.

పదోన్నతులు కల్పించాలి

● మునిసిపల్ ఇంజినీరింగ్ యూనియన్ గౌరవాధ్యక్షుడు తిరుపతిరావు



నిరసన తెలుపుతున్న మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని మునిసిపల్ ఇంజినీరింగ్‌వర్కర్స్‌యూనియన్ గౌరవాధ్యక్షుడు తిరుపతిరావు కోరారు.సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ చేస్తున్న సమ్మె ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీకాకుళం నగరపాలకసంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంలో తిరుపతిరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు టెక్నికల్ రూ.29,200లు, నాన్ టెక్నికల్ రూ.24,500లు ఇవ్వాలనిదీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, పదవీ విరమణ వయస్సును 60 ఏళ్లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్, శంకరరావు, ముఖేష్ యాదవ్, జై కిషోర్, మజ్జి.శ్రీను, సతీష్, రాఘవ, శశి, గోవిందరాజు, త్రినాథ, వెంకట్, రూప, రమేష్‌బాబు, సాగర్, చంద్రశేఖర్, మెంటాడ.శేఖర్ పాల్గొన్నారు.

21న డీఈవో కార్యాలయం ముట్టడి

పాత శ్రీకాకుళం, మే18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 21నఉమ్మడి డీఈవో కార్యాలయం ముట్టడించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు.ఆదివారం యూటీఎఫ్, ఏపీటీఎఫ్, డీటీఎఫ్, ఎస్టీయూ, బీటీఏ,ఎస్ఎల్‌టీఏ, ఎస్సీ ఎస్టీ యూనియన్ తదితర ఉపాధ్యాయ సంఘాల ప్రధాననాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన జీవో -117 వల్ల మూడు లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు మారిపోయారని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆదే విధానాలను కొనసాగిస్తోందని విమర్శించారు. ఈ కార్య క్రమంలో ఏపీటీఎఫ్‌నాయకుడు మజ్జి మదన్ మోహన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బమ్మిడి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం ఇవ్వండి

● రాష్ట్ర మానవ హక్కుల వేదిక, రైతు స్వరాజ్య వేదిక సభ్యులు



మాట్లాడుతున్న రాష్ట్ర మానవ హక్కుల వేదిక, రైతు స్వరాజ్య వేదిక సభ్యులు

కంచిలి, మే 18 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి ఏడు లక్షల రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని రాష్ట్ర మానవ హక్కుల వేదిక, రైతు స్వరాజ్య వేదిక సభ్యులు కోరారు.రాష్ట్రంలో కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.మండలంలోని పెద్దకొజ్జిరియాకు చెందిన కౌలు రైతు బల్లెడ నర్సింహమూర్తి ఇటీవల ఆత్మహత్యచేసుకోవడంతో రాష్ట్ర మానవ హక్కులవేదిక, రైతు స్వరాజ్య వేదికసభ్యులు వీఎస్‌కృష్ణ, కె.ప్రధాన్, తామాడ అరుణ, బాలు గోడి, కేవీ జగన్నాథం, బీసీహక్కుల ప్రతినిధి బీన ఢిల్లీరావు ఆయన రైతుకుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకుంటే, ఇంతవరకు ప్రభుత్వం కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయకపోవడంపై ప్రశ్నించారు. ఉద్దాన ప్రాంత రైతాంగానికి ప్రభుత్వాలు బాసటగా నిలవాలన్నారు.ఎక్కడైనా రైతు ఆత్మహత్య చేసుకుంటే, వెంటనే త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి, నివేదికను కలెక్టర్‌కు పంపించాల్సి ఉందన్నారు. కానీ నర్సింహమూర్తి మృతిచెంది40 రోజులు గడిచినా జిల్లాకు చెందిన మంత్రి త్రిసభ్య కమిటీని ఎందుకు వేయలేదన్నారు.2020లో ప్రభుత్వం ఇచ్చిన జీవో 43 ప్రకారం రైతు ఆత్మహత్య చేసుకుంటే, బాధిత కుటుంబానికి ఏడు లక్షల రూపాయల నష్ట పరిహారం అందించాలన్నారు.

డీసీఎంఎస్ ఛైర్మన్‌కు అభినందన

ఎచ్చెర్ల, మే 18(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ ఛైర్మన్‌గా నియమితులైన చౌదరి అవినాష్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ సిబ్బంది ఆదివారం అభినందించారు.ఎస్ఎంపురంలోని తననివాసంలో బీఆర్ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌రాజశేఖరరావు, అధ్యాపకులు హనుమంతు సుబ్రహ్మణ్యం,శ్రీధర్ తదితరులు కలిశారు.అలాగే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నేతలు అవినాష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం, మే18(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తేలుకుంచి, హరిపురం, మశాఖపురం, జగన్నాథపురం, బిర్లంగి, తోటూరుల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలి

ఆమదాలవలస, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గృహ విద్యుత్ వినియోగదారులు జూన్30లో అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చని విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ జి.రామారావు ఒక ప్రకటనలోతెలిపారు.మీసేవ కేంద్రాలు, ఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదనపు విద్యుత్ ధర కిలోవాట్‌కు రూ.2,250, కాగా తగ్గింపుధరతో 1250 రూపాయలు,రెండు కిలోవాట్లకు 4450 తగ్గింపు ధరతో రూ.2250, మూడు కిలోవాట్లకు 650 తగ్గింపు ధరతో 3650, నాలుగు కిలోవాట్లకు 8850 తగ్గింపు ధరతో 4850, ఐదుకిలోవాట్లకు 11050కాగా తగ్గింపు ధరతో6050 రూపాయలు చెల్లించి అదనపువిద్యుత్ లోడ్‌ను క్రమబద్దీకరించుకోవచ్చని తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

శ్రీకాకుళం క్రైం, మే 18(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగకపోతే చర్యలు తప్పవని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ ఈశ్వరరావుహెచ్చరించారు. ఆదివారం శ్రీకాకుళంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్లు ఎటువంటి తగాదాలు, షటిల్ మెంట్లు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని, అట్టివారిపై తదుపరి చర్యలు చేపడతామని స్పష్టంచేశారు.ప్రతి ఆదివారం రౌడీషీటర్లకు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

క్రికెట్ విజేత కాకర్లపుట్టుగ

కంచిలి, మే18 (ఆంధ్రజ్యోతి): కొక్కిలిపుట్టుగలో జరిగిన జామిఎల్లమ్మ క్రికెట్ టోర్నీ విజేతగా కాకర్లపుట్టుగ నిలిచింది. ఆదివారం కాకర్లపుట్టుగ, కంచిలి జట్ల మధ్య జరిగిన ఫైనల్‌లో కాకర్లపుట్టుగ విజయం సాధించింది. మ్యాన్‌ఆఫ్ ద మ్యాచ్ వినీత్, మ్యాన్‌ఆఫ్‌ద సిరీస్ నవీన్ అందుకున్నారు.

పేకాట శిబిరంపై దాడి

పొందూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తండ్యాం పంచాయతీలోగల లక్ష్మీపురం సమీపంలో పేకాటశిబిరంపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా చేసిన దాడిలో ఆరుగురు జూదర్లు పట్టుబడ్డారు. టాస్క్‌ఫోర్సు పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆదివారం పేకాటశిబిరంపై దాడిచేశారు. ఈదాడిలో రూ.20,400 నగదు, ఐదు సెల్‌ఫోన్లను జూదరుల నుంచి స్వాధీనం చేసుకుని, జూదరులు, పేకాటశిబిరం నిర్వాహకులపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

ప్లాస్టరింగ్ లేక.. పనులు పూర్తి కాక

● ఇదీ లొద్దభద్రలో గ్రామసచివాలయ భవన నిర్మాణం పరిస్థితి



లొద్దభద్రలో అర్ధాంతరంగా నిలిచిపోయిన గ్రామసచివాలయం

పలాసరూరల్,మే18(ఆంధ్రజ్యోతి):మండలంలోని లొద్దభద్ర గ్రామ సచివాలయం భవనం నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. నాలుగేళ్లుగా పనులు పూర్తిచేయకపోవడంతోపాటు ప్లాస్టరింగ్ కూడా చేయలేదు. ఇక్కడే ఆ పంచాయతీకి సంబంధించిన కార్యకలాపాలు కింద భాగంలో అధికారులు నిర్వహిస్తున్నారు. టీడీపీ హయాంలో 2017 డిసెంబరు నెలలో రూ.13లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో భవన నిర్మాణం చేపట్టారు. కేవలం కింద గదులకు మాత్రం పూర్తిస్థాయిలో ప్లాస్టరింగ్ చేసి రెండుగదులతో నిర్మాణం చేపట్టారు. తొలుత పంచాయతీ భవన నిర్మాణం జరిగినా అనంతరం వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ భవనంగా వినియోగిస్తున్నారు. అప్పటి నుంచి పూర్తిస్థాయిలో పనులు చేయకపోవడంతో ఇటుక కట్టడాలతోనే భవనం కనిపిస్తోంది. కిందిగదిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు సచివాలయం ద్వారా ఉత్తమమైన పాలన అందించాలని భవనాల నిర్మాణం చేపట్టినా ప్లాస్టరింగ్ పనులు కాకపోవడంతో పాత భవనం తలపిస్తోంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి పైభాగంలో ఉన్న గదులకు ప్లాస్టరింగ్‌చేసి భవనం పూర్తిచేసి ప్రజలు సేవలందించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జయహో భారత్

● పట్టణాల్లో తిరంగా యాత్ర

'ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన నేపథ్యంలో ఆదివారం జిల్లాలోని పలు పట్టణాల్లో తిరంగా ర్యాలీని నిర్వహించారు. వివిధ పార్టీలు, సంస్థల ప్రతినిధులు ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండాను పట్టుకుని 'జయహో భారత్, వందే మాతరం వంటి నినాదాలతో పట్టణాలను హోరెత్తించారు. కార్యక్రమాల్లో పలువురు ప్రజా ప్రతినిధులు, సంఘాలు, పార్టీల నేతలు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం


రణస్థలం: జాతీయ రహదారిపై తిరంగా ర్యాలీలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్ఈఆర్ తదితరులు


ఇచ్ఛాపురం: బస్టాండ్ జంక్షన్ వద్ద ర్యాలీలో ఎమ్మెల్యే బెందాళం అశోక్


ఆమదాలవలస: తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కూన రవికుమార్



నరసన్నపేట: తిరంగా యాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


ఎచ్చెర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


టెక్కలి: తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


కాశీబుగ్గ: త్రివర్ణ పతాకంతో కూటమి నాయకుల ర్యాలీ

పాలవలసలో యువకుడి హత్య


ఈశ్వరరావు మృతదేహం

సోంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలవలసలో ఓ యువకుడి హత్యతో కలకలం నెలకొంది. వారం రోజులుగా సంబరాలు జరుగుతున్న సమయంలో హత్య జరగడంతో ఆదివారం ఉదయం గ్రామం ఉలిక్కి పడింది. సోంపేట సీఐ మంగరాజు, బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు, గ్రామస్థుల కథనం మేరకు.. పాలవలసకి చెందిన గోకర్ల ఈశ్వరరావు(38) అందరితో కలివిడిగా ఉండేవాడు. ఎవరితో ఎటువంటి తగాదాలు లేవు. ఈశ్వరరావు శనివారం రాత్రి ఇంటి నుంచి బయలు దేరి సంబరానికి వెళ్లాడు. రాత్రి 12 గంటల నుంచి కనిపించకపోవడంతో వెతకడం ప్రారంభించారు. ఆదివారం ఉదయం గ్రామానికి సమీపంలోని తోటల్లో విగత జీవిగా పడిఉండాన్ని గుర్తించారు. ఈశ్వరరావును ఎవరో గాజు సీసాతో పీకపై కోసిపడేసినట్లు, మెడ ఎడమ చెవి, తలపైన గాయాలు ఉన్నట్లు గుర్తించారు. నుదురుపైన గాయాలు కనిపిస్తున్నాయి. రాత్రివేళ హత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. అన్నికోణాల్లో దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం నుంచి ఈశ్వరరావు ఎక్కడెక్కడ తిరిగాడు, ఎవరితో ఉన్నాడన్న విషయాలను సేక రిస్తున్నారు. శనివారం రాత్రి భోజనం తరువాత ఎవరెవరిని కలి శాడు. అన్నవిషయాలపై ఆరా తీస్తున్నారు. పాత గొడవలతో పాటు ఆర్థిక లావా దేవీలు, ఇతర విషయాలపై కూడా ఆరా తీస్తున్నారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు సంఘటనస్థలాన్ని ఆదివారం పరిశీలించారు. అన్ని కోణా ల్లో విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ఈశ్వరరావు రంగులు వేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయనకు భార్య పార్వతి, రెండేళ్ల పాప ఉంది.

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి

● మృతుడిది జి.సిగడాం మండలం బాతువ


మృతి చెందిన డ్రైవర్ చిన్నారావు

లంకెలపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : అనువమానాస్పదంగా ఓ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం లంకెలపాలెం జాతీయ రహదారి పెట్రోల్ బంకు వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం బాతువ ప్రాంతానికి చెందిన పాండంగి చిన్నారావు (40) ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విశాఖపట్నం వెంకోజీపాలెంలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాకినాడలో ఆయిల్ అన్‌లోడ్ చేసి బయల్దేరి పరవాడ మండలం లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద శనివారం రాత్రి వాహనాన్ని పార్కింగ్ చేశాడు. ఆది వారం ఉదయానికి అతడు తన ట్యాంకర్ వాహనం పక్కనే విగతజీవిగా పడి ఉన్నాడు. ఇది గుర్తించిన స్థానికులు పరవాడ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అయితే మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, అనారోగ్యం కారణంగానే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు


రోడ్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

కొత్తూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం వసప గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయా య్యాయి. వసప గ్రామం నుంచి కొత్తూరు-నివగాం రహదారిపైకి వస్తుండగా నివగాం నుంచి కొత్తూరు వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనానికి ఢీకొట్టడంతో కొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. క్షత గాత్రులు గురండి గ్రామానికి చెందిన బోర వినోద్, కుంటి భద్రకు చెందిన మహిళగా గుర్తించారు. తీవ్ర గాయాలైన ఇద్దరిని స్థానికులు వైద్యం కోసం కొత్తూరు ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీని వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్లపై కేసు

కొత్తూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం వైఆర్‌పేట గ్రామ తోటల్లో పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం దాడి చేసి ఐదుగురిని పట్టు కుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి వారి నుంచి రూ.5,760 స్వాధీనం చేసుకున్నామన్నారు.

అ'పూర్వ' కలయిక


నాటి ఉపాధ్యాయులతో 1995-98 బ్యాచ్ విద్యార్థులు

హిరమండలం, మే 18(ఆంధ్రజ్యోతి): తులగాం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం బ్యారేజీ సెంటర్‌లోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వ హించారు. 1995-98 సంవత్సరాల్లో చదువుకున్న విద్యార్థులు 27 ఏళ్ల తరువాత ఒక చోట కలుసుకుని యోగ క్షేమాలు చెప్పుకుని ఆనందం పొందారు. నాటి గురువులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

మోనింగివాని చెరువు పనులపై నోటీసు

హిరమండలం, మే 18(ఆంధ్రజ్యోతి): హిరమండలం మేజర్ పంచాయతీ పాత బస్టాండ్ వద్ద ఉన్న మోనింగి వాని చెరువు అభివృద్ధి పనులకు ఎలాంటి లిఖితపూర్వక అనుమతులు లేకుండా చేపట్టడంతో సంబంధిత వ్యక్తికి నోటీసులు జారీచేసినట్లు పంచాయతీ ఈవో శివాజీ తెలిపారు. గ్రామానికి చెందిన పోతురాజు శ్రీధర్ ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి చెరువు రూపురేఖలు మార్చే ప్రయత్నించడం చట్టరీత్యా నేరమని ఆ నోటీసులో పేర్కొన్నారు. వెంటనే చెరువులో ఏర్పాటు చేసిన కంచెను తొలగించి పనులు నిలిపి వేయాలన్నారు. లేకుంటే ఏపీ పంచా యతీరాజ్ చట్టం 1994 ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆ నోటీసులో పేర్కొన్నారు.

క్వారీల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

● ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, మే 18(ఆంధ్రజ్యోతి): గ్రానైట్, రోడ్డు మెటల్ క్వారీల నిర్వహ రణకు అన్ని రకాల అనుమతులు తప్పనిసరని ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గనులు, రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెళియాపుట్టి మండలంలో క్వారీలో జరిగిన పేలుళ్ల నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పేలుళ్లు జరిగిన క్వారీకి పలు రకాల అనుమతులు లేనట్లు గుర్తించామన్నారు. గ్రానైట్ క్వారీ నిర్వహణకు రెవెన్యూ, పంచాయతీ, పర్యావరణ, బ్లాస్టింగ్ అనుమతులు ఉండాలన్నారు. ఆయా గ్రానైట్ క్వారీలు అన్ని అనుమతులు చూపే వరకు ఎటువంటి పనులు చేయ వద్దని, నిలుపుదల చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్, మైన్స్, పంచాయతీ అధికారులు నేరుగా క్వారీలకు వచ్చి ఆయా రకాల అనుమతులు పరిశీలించిన తరువాత అన్నీ సక్రమంగా ఉంటేనే క్వారీల నిర్వహణకు అనుమతులు ఇవ్వ డం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు, సీఐలు విజయ్ కుమార్, రామారావు, గ్రానైట్ క్వారీల యజమానులు దొడ్ల మహేష్, హరికుమార్, అల్లు నగేష్, పాండ్యన్, తహశీల్దార్లు రవికుమార్, అప్పలరాజు, మైన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రానైట్ క్వారీల ప్రతినిధులు, అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, చిత్రంలో ఏఎస్పీ శ్రీనివాసరావు (ఇన్‌సెట్‌లో)

క్రీడలతో మానసికోల్లాసం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ధర్మాన తేజకుమార్

జలుమూరు, (సారవకోట), మే 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్ అన్నారు. టీడీపీ వ్యవ స్థాపకుడు ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడల్లోను రాణించిన నాడే జాతీయస్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. టోర్నీ నిర్వాహకుడు, మాజీ ఎంపీటీసీ కోన వెంకటేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురవరపు తిరుపతిరావు, పి.నందకిశోర్, డి.జయరాం, తాడేల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

● పోలాకి, మే 18(ఆంధ్రజ్యోతి): మానసికోల్లాసానికి ఆటల పోటీలు దోహదం చేస్తాయని గుల్లవానిపేట సర్పంచ్ వారాది మోహనరావు అన్నారు. ఆదివారం జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.


పోలాకి: టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రికెట్ క్రీడాకారులు

ప్రధాన రోడ్లు ఇలా..


కొత్తూరు-నివగాం మార్గంలో పెద్ద గొయ్యి

కొత్తూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కొత్తూరు-నివగాం మార్గంలో గౌడు వీధి సమీపంలో ప్రధాన రోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. గోతులను పూడ్చేందుకు సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో నిత్యం వాహనాలు ఆ గొయ్యిలో పడి వాహనదారులు గాయపడుతున్నారు. ఒడిశాకు వెళ్లేందుకు ఇదే ప్రధానం కావడంతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై గొయ్యి ఏర్పడి వర్షపు, మురుగు నీరు నిల్వ ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.


చీపి రోడ్డులో నవర కృష్ణాపురం వద్ద రోడ్డు దుస్థితి..

చినకోష్ఠ వద్ద..

హరిపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): మందస మండలం చీపి-బుడార్సింగి మీదుగా చిన్నకోష్ఠ రహదారి ఇది.. నిర్మాణం ప్రారంభించి ఐదేళ్లయినా ఇప్పటికీ పూర్తి కాలేదు.. గోతులమయమై కాలినడకకు ఇబ్బందిగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

నందిగాం, మే 18(ఆంధ్రజ్యోతి): సైలాడ పంచాయతీ రౌతుపురంలో వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ఏడో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అర్చకులు శంభాన దానయ్య పర్యవేక్షణలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఉదయం విఘ్నేశ్వరపూజ, పంచామృతాభిషేకం, అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి కల్యాణం చేశారు. సాయంత్రం స్వామివారి తిరువీధి చేపట్టారు.

కర్లపూడిలో గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం


కర్లపూడిలో దేవరను తీసుకువస్తున్న భక్తులు

నందిగాం, మే 18(ఆంధ్రజ్యోతి): కర్లపూడిలో గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం ప్రారంభ మయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పాతపట్నం అమ్మ, భూలోకమ్మ, బంగారమ్మ గ్రామ దేవతలకు చల్లదనం చేశారు. అమ్మ వారి దేవరన ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకువచ్చారు. ఈ ఉత్సవాలు మూడురోజుల పాటు నిర్వహించనున్నారు.

ఘనంగా మహా కుంభాభిషేకం


కుంభాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితుడు రమేష్‌శర్మ

జలుమూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): గొలియాపుట్టి గ్రామంలో వెలసిన ఉమా రామలింగేశ్వర స్వామికి ఆదివారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా 3వ రోజు ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేద పండితుడు అక్కాజోష్యుల రమేష్ శర్మ ఆధ్వర్యంలో 8 మంది రుత్వికులతో విశేష పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, అష్టోత్తర కలశ స్నపనం, శ్రీరుద్ర సౌర హవనాలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

చిమ్మ చీకటిలో తాళభద్ర రైల్వేగేటు


చీకటిలోనే వాహనాల రాకపోకలు సాగిస్తున్న దృశ్యం

పలాస, మే 18(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ తాళభద్ర రైల్వే గేటు, రోడ్డులో వీధి లైట్లు లేకపోవడంతో రాత్రయితే వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడపాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. వాహనాల వెలుగులోనే దారి వెతుక్కుంటూ గేటు దాటాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గేటు వద్ద రైల్వేశాఖ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు ఉండేవి. అవి మరమ్మతులకు గురికావడంతో ఆ ప్రాంతమంతా చిమ్మ చీకటి అలముకుంది. తాళభద్ర రోడ్డులో మున్సిపాలిటీ విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకటిలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి గేటు వద్ద ఈ దృశ్యం కనిపించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

నిరుపయోగం



పలాస రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): టెక్కలి పట్నంలోని ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటి నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. పంచాయతీ భవనం, ఇతర శాఖలు నిర్వహించిన మరో భవనం రెండు పక్కపక్కనే వృథాగా ఉన్నాయి. గతంలో ఈ భవనాల నుంచే పాలనా వ్యవహారాలు చేసేవారు. ప్రస్తుతం గ్రామ సచివాలయం వేరే చోట నిర్మించడంతో వీటిని వదిలేశారు. వీటికి మరమ్మతులు చేపట్టి వినియో గంలోకి తీసుకువస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

న్యూస్ బాక్స్

నేడు బాలిగాం రైల్వే గేటు మూసివేత

హరిపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): హరిపురం-మందస రోడ్‌లో బాలిగాం వద్ద రైల్వే గేటు సోమవారం మూసి వేస్తున్నట్లు సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గేటు వద్ద రైలు పట్టాలు, ఇతర మెయింటెనెన్స్ పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో గేటు మూసి వేస్తున్నామన్నారు. పనులు పూర్తయిన వెంటనే యథావిధిగా రాకపోకలకు అనుమతించ నున్నామని, ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించి సహకరించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం

టెక్కలి, మే 18(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఆదివారం ఆయన అభిమానులు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 33 మంది యువత రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ సునీత ఈ శిబిరాన్ని పర్యవేక్షించగా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు డి.భాస్కర్, వెంకీ, పవన్, బాలకృష్ణ, సింహాద్రి, లక్ష్మణ్, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

పాతపట్నం, మే 18(ఆంధ్రజ్యోతి): రౌతులక్ష్మీపురంలోని పుస్తక నిక్షిప్త కేంద్రానికి (బీడీసీ) రిటైర్డ్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.రామరాజు పుస్తకాలను వితరణగా ఆదివారం అందజేశారు. వివిధ పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు, వృద్ధులకు, మహిళలకు ఉపయోగపడే ఆధ్యాత్మిక పుస్తకాలు, చిన్నారులకు నీతికథల పుస్తకాలు అందించారు.

సాగునీటి నిల్వకు చెక్‌డ్యామ్‌లు

కొత్తూరు, మే 18(ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ జేఈ పైల ప్రసాదరావు, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. ఆదివారం గెడ్డలు, కాలువలను పరిశీలించారు. వర్షాధార భూములు కావడంతో నీటిని సాగునీటి వనరులుగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందని, వీటిని ఆయా నీటి సంఘాలు సద్విని యోగం చేయాలన్నారు. కార్యక్రమంలో కొత్తూరు, కర్లెమ్మ నీటి సంఘం అధ్యక్షులు గోగులు చిట్టిబాబు, బోర శ్రీరాములు, రైతులు పడాల వెంకటకృష్ణ, పెదకోట యతిరాజు, ఎల్.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

కొత్తూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం మెట్టూరు పంచాయతీ నేరడి సర్వే నెంబరు 114లో సుమారు 2.39 సెంట్లు ప్రభుత్వ గయ్యాలి భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఐదుగురికి డి-పట్టాలు మంజూరు చేశారని, వారు మరణించడంతో ఈ పట్టాలను రెవెన్యూ అధికారులు రద్దు చేసి ఇతరులకు పట్టాలు కేటాయించే దాఖలాలు లేకపోవడంతో కొందరు ఆక్రమణదారులు కబ్జా చేసి భవనాల నిర్మాణం చేపడుతున్నారన్నారు. విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.